
పర్యావరణ హితం.. మన అభిమతం



గడ్డి పూర్తిగా చుట్టిన తరువాత మట్టితో తయారవుతున్న గణనాథుడు



హరిపాలెంలో విక్రయాలకు సిద్ధంగా ఉన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు



గడ్డి, మట్టిని ఉపయోగించి పర్యావరణ హితంగా తయారవుతున్న ఉత్సవమూర్తులు

- పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు
- కాలుష్యంతో జలచరాలకు ముప్పు
- మట్టి వినాయక ప్రతిమల తయారీపై అవగాహన అవసరం

అచ్యుతాపురం రూరల్ : వినాయక చవితి వచ్చేస్తోంది. నవరాత్రులు ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతాయి. అయితే అత్యధికులు పర్యావరణ హితాన్ని విస్మరిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ), రసాయనాలతో రూపుదిద్దిన వినాయక విగ్రహాలు మండపాలపై ఏటా వెలుస్తున్నాయి. పర్యావరణానికి ముప్పు తెచ్చే రసాయన విగ్రహాలకు బదులు మట్టి ప్రతిమలు మేలని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా కొందరు మాత్రమే ప్రకృతి ప్రేమికులుగా ప్రత్యేకత చాటుకుంటూ మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠిస్తున్నారు.

మండలంలో చోడపల్లి, కొండకర్ల, హరిపాలెం, తిమ్మరాజుపేట, తదితర గ్రామాల్లో యథేచ్ఛగా పీవోపీతో వేలాది వినాయక విగ్రహాలు తయారీ చేస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో ప్రకృతిలో ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది. నవరాత్రుల అనంతరం నిమజ్జన సమయంలో చెరువు, నది, సముద్రంలో నిమజ్జనం చేయడం ద్వారా నీటిని ఆధారం చేసుకుని జీవించే ఎన్నో జీవరాసులకు ముప్పు తప్పడం లేదు. కొన్ని చోట్ల మాత్రమే గడ్డిని ఉపయోగించి మట్టితో విగ్రహాలను తయారు చేస్తున్నారు.

ఇప్పటి నుంచే అవగాహన అవసరం

ఈ నెల 27న జరిగే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల కోసం ప్రభుత్వాలు, కాలుష్య నియంత్రణ మండలి ఇప్పటి నుంచి అవగాహన కల్పించాలి. మట్టి ప్రతిమల తయారీకి అవసరమైన కార్యాచరణ చేపట్టాలి. మట్టి ప్రతిమల తయారీదారులను ప్రోత్సహించాలి. విస్తృతంగా అవగాహన సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించి చైతన్య పరచాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వలే మట్టితో పెద్ద విగ్రహాల తయారీపై శిక్షణ ఇవ్వాలి.

మట్టితో ప్రయోజనాలు

- మట్టి ప్రతిమలు నీటిలో కరుగుతాయి.
- సాధారణ రంగుల వాడకంతో జలచరాలు, మానవులపై ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు.
- ప్రకృతి జీవరాశులకు మేలు చేస్తాయి.

పీవోపీతో ముప్పు

- పీవోపీ ప్రతిమలు నీటిలో కరగవు. ముడి పదార్థాలు, రంగుల్లో వాడే రసాయనాలు ముప్పుగా మారుతాయి. నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుంది. చేపలు, ఇతర జలచరాలకు హాని కలిగిస్తాయి.
- మానవ నాడీ వ్యవస్థ, ఊపిరితిత్తులు, కిడ్నీలపై దుష్ప్రభావాన్ని చూపుతాయి. చర్మ వ్యాధులు, ప్రమాదకర క్యాన్సర్లకు దారి తీస్తుంది.
- కృత్రిమ రంగులతో బురదతో మేలు చేసే క్రిములు చనిపోతాయి.

మట్టి విగ్రహాలనే పూజించాలి



ఎన్నో అనర్థాలకు కారణమవుతున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను పూజించొద్దు. మట్టి విగ్రహాలను తయారు చేసుకుని పూజిస్తే పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా ఎన్నో మూగ జీవాలకు ప్రాణం పోసిన వారమవుతాం. అధికారులు మట్టితో చేసిన విగ్రహాలను మాత్రమే అమ్మకాలు జరిగేలా కఠినమైన చర్యలు తీసుకోవాలి. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మట్టి విగ్రహాల తయారీపై అవగాహన కల్పించాలి.

– మాదెం సూరి అప్పారావు, పర్యావరణ ప్రేమికుడు, అచ్యుతాపురం

క్లుప్తంగా

శ్రీదేవీతల్లి అమ్మవారి సన్నిధిలో ఘనంగా కలశ ప్రతిష్ట



కలశ ప్రతిష్టలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: ఉమ్మలాడలో పునర్నిర్మించిన శ్రీదేవీతల్లి అమ్మవారి ఆలయ వేడుకల్లో భాగంగా బుధవారం కలశ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి, నారాయణరావు, శంకర్, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. 7న చండీ హోమం, 8న ఊరేగింపు, 9న భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సోమరాజు

మునగపాక: గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.సోమరాజు కోరారు. బుధవారం సాయంత్రం తన ఛాంబర్‌లో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై బాధ్యతగా పని చేయాలన్నారు. సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లపై కూడా దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



మునగపాకలో పొక్లెయిన్ సాయంతో భవనాల తొలగింపు పనులు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా మునగపాకలో భవనాల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. రహదారి విస్తరణలో కట్టడాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వం టీడీఆర్ రూపంలో చెక్కులు అందజేసింది. దీనిలో భాగంగా మెయిన్‌రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయ కాంప్లెక్స్, బస్ షెల్టర్‌తో పాటు ఆడారి శ్రీరాములకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ తదితర భవనాలను పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్నారు. టీడీఆర్ బాండ్లు తీసుకున్న నిర్వాసితులు స్వచ్ఛందంగా భవనాలను తొలగించేందుకు అంగీకరించి ముందుకు రావడంతో రహదారి విస్తరణకు మార్గం సుగమమైంది.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు భక్తులు తమ వంతు సాయం అందజేస్తున్నారు. బుధవారం యల్లపు వెంకట సూరప్పారావు, వరలక్ష్మి దంపతుల కుమారుడు మణికుమార్ తనవంతు సాయంగా 20,516 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి చేయండి



కార్యదర్శులతో సమీక్ష చేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పీ4 సర్వే, ఇంటి నిర్మాణాలు తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, ఈవోపీఆర్డీ రఘురాం, కార్యదర్శులు పాల్గొన్నారు.

అణుకు గ్రామంలో ఎన్‌ఆర్‌ఎస్‌టీ సెంటర్

- విద్యా వలంటీరుకు దరఖాస్తుల ఆహ్వానం

కోటవురట్ల: గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామానికి నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ మంజూరైనట్టు ఎంఈవో–1 రామారావు తెలిపారు. సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు సమన్వయాధికారి ఉత్తర్వుల మేరకు 2025–26 విద్యా సంవత్సరానికి ట్రైనింగ్ సెంటర్‌ను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సెంటర్‌లో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యా బోధన ఉంటుందని తెలిపారు. విద్యాబోధనకు విద్యా వలంటీరు లేదా ఉపాధ్యాయుడిని 6 నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన రూ.10 వేలు గౌరవ వేతనంతో నియమించనున్నట్టు చెప్పారు. ఇందుకోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హత సర్టిఫికెట్లతో ఈ నెల 11వ తేదీలోగా స్థానిక ఎమ్మార్సీలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. అభ్యర్థులు ఇంటర్మీడియెట్, డీఎల్ఎడ్ చేసి ఉండాలని, గొట్టివాడ పంచాయతీలోని అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం రూరల్ : మండలంలో పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, సాయి ప్రియా లేఅవుట్, జగనన్న కాలనీ, ఆర్ అండ్ ఆర్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం కూడలి, దిబ్బపాలెం, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్, ఎస్‌టీబీఎల్ కాలనీ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

సీపీఎం నాయకుల అక్రమ నిర్బంధంపై నిరసన



అచ్యుతాపురం కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం రూరల్ : సీపీఎం నాయకుల అక్రమ నిర్బంధం దారుణమని ఆ పార్టీ నాయకుడు రొంగలి రాము అన్నారు. ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటాలను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లను గృహ నిర్బంధం చేయడాన్ని ఖండిస్తూ అచ్యుతాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో అచ్యుతాపురం కూడలిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు బలవంతపు భూసేకరణ, ప్రజాభిప్రాయ సేకరణ ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి అప్పారావు, కూండ్రపు సోమునాయుడు, చాపల తాతయ్య, గోపి, రాజు, సన్యాసిరావు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, చెరువు కాలువ సంఘ రైతులు

మునగపాక: మునగపాకలో పేరొందిన చెరువు కాలువ సంఘ పరిధిలోని సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. వేద పండితుడు నాని పంతుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, మారిశెట్టి వెంకటప్పారావు, ఆడారి కాశీబాబు, తదితరులు పూజా కార్యక్రమానికి హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చెరువు కాలువ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దాడి చంద్రరావు, వెలగా అప్పలనాయుడు, సంఘ రైతులు కర్రి రామ జోగినాయుడు, ఆడారి జగ్గారావు, బొడ్డేడ రామునాయుడు, వెలగా వెంకటప్పారావు, వెలగా శ్రీనివాసరావు, బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా ధర్మసూరి అప్పారావు, సూరిబాబు, బొడ్డేడ రామారావు, దాడి అప్పారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



వైఎస్సార్ సీపీ నాయకుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కంబాల, చిక్కాల

పాయకరావుపేట: పట్టణంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లంక శ్రీను మృతి చెందారు. ఈ మేరకు బుధవారం శ్రీను కుటుంబ సభ్యులను పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు పరామర్శించి, ధైర్యం చెప్పారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పెంటకోట సర్పంచ్, ఉప సర్పంచ్‌లు చేపల నాగమణి తాతాజీ, చిక్కాల సూర్యనారాయణ, యర్ర శివరాం, కొమ్మన వెంకన్న, బూడిద గౌరీ శంకర్, బల్ల సత్తిబాబు, శ్రీపతి ప్రభాకర్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాల ప్రాముఖ్యతపై మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ

మునగపాక: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చేంత వరకు తల్లిపాలు అందించాలన్నారు. బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ కాండ్రేగుల సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన



పెదఉప్పలంలోని పొలంలో సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు



ఎస్.నర్సాపురంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఎస్.రాయవరం: రైతులు విధిగా పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని యలమంచిలి కొక్కిరాపల్లి పరిశోధన సహాయ సంచాలకురాలు శిరీష సూచించారు. పెదఉప్పలం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో సౌజన్య, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు అవసరం

పాయకరావుపేట: మండలంలోని ఎస్.నర్సాపురం, కుమారపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పిలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వరి నారుమడిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ రైతులకు అవగాహన కల్పించారు. కొబ్బరి, తమలపాకు తోటలను సందర్శించి చీడపీడలు, సమగ్ర సస్య రక్షణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపి, ఏఈవో నాగమణి, ఎంపీఈవో శరత్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త జోగులు
- మాసాహేబుపేటలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న కంబాల జోగులు, నాయకులు

పాయకరావుపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ మోసాలను, ముఖ్యమంత్రి చంద్రబాబు నైజాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి తిప్పి కొట్టాలని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పిలుపునిచ్చారు. మండలంలోని మాసాహేబుపేట గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు అధ్యక్షతన మోసాహేబుపేట సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు స్వగృహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు 144 హామీలు, సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చారన్నారు. వాటి అమలు కోసం బాండ్లు పంపిణీ చేస్తూ వాటిపై కూటమి నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంతకాలు కూడా చేశారన్నారు. ప్రజల్ని మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. బాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రైతులకు ఎరువులు సరఫరా చేయలేదన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో కరువు ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కూడా కూటమి పాలనలో రైతుల పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పయనించిందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఎంపీటీసీలు కె.నరేష్, టి.శేఖర్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పన్నీరు బాబ్జి, వంగలపూడి సరస్వతీ రామారావు, సకిలేటి రాము, చేపల నాగమణి తాతాజీ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దేవవరపు రాజేష్ ఖన్నా, పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి యజ్జల అన్నవరం, పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడపాటి గోవిందు, గ్రామ శాఖల నాయకులు సూరకాసుల అన్నవరం, పల్లేల వెంకట్, పెనుమత్స నాగేశ్వరరావు, మహిళా నాయకులు బొడ్డా శ్రీదేవి, అడపా శ్రీదేవి, కొంతం వరలక్ష్మి, పులి సీతారత్నం, పాలపర్తి సతీష్, అవతారం రాజు, తూము రాజుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు బుధవారం ఉత్సాహంగా సాగాయి. ఇన్‌చార్జ్ హెచ్ఎం సుకుమార్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విభాగాలలో ఆటల పోటీలు నిర్వహించారు. పరుగు పందెం, కబడ్డీ, క్రికెట్, ఖోఖో పోటీలను పీడీ మట్ల గణేష్ పర్యవేక్షణలో నిర్వహించారు. సుకుమార్ మాట్లాడుతూ విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. పీఈటీ బాబు, ఉపాధ్యాయులు కృష్ణ, బి.ఎస్.ప్రసాద్, రాజీవ్, కల్యాణ్, లావణ్య, కిషోర్, బ్రహ్మతేజ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు కృషి

కోటవురట్ల: స్వచ్ఛ గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. ఐవీఆర్ఎస్ గ్రామం బి.కె.పల్లిలో బుధవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ వీధుల్లో పర్యటించి స్థానికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. డ్రైనేజీలను పరిశీలించి పూడిక తీయించారు. ఇంటితో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈవోపీఆర్డీ రఘురాం, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ హామీలపై రాజీలేని పోరాటం

- చంద్రబాబుది నయవంచన పాలన
- వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీ



రాంబిల్లి మండలంలో నిర్వహించిన బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): కూటమి ప్రభుత్వం హామీల అమలు కోసం కల్లబొల్లి మాటలు చెబుతోందని, ప్రతిపక్ష పార్టీగా హామీల అమలు కోసం రాజీలేని పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. రాంబిల్లి మండలంలోని రజాల, కుమ్మరాపల్లి, కట్టబోలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'సమావేశాల్లో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కూటమి కుయుక్తులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం, గెలిచాక వాటిని అటకెక్కించడం బాబుకు వెన్నతో పెట్టిన విద్యేనని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని పథకాలను విజయవంతంగా అమలు చేశామని గుర్తు చేశారు. రైతులెవ్వరూ నీటి తీరువా కట్టవద్దని సూచించారు. రాంబిల్లి మండలంలో పరిశ్రమల బాధితుల తరఫున పోరాడతామని స్పష్టం చేశారు. బాబు వస్తే వెంటనే కరువు వస్తుందని పేర్కొన్నారు. రాంబిల్లి మండలంలోని అన్ని సమస్యల్ని దశల వారీగా పరిష్కరించేందుకు అధికారులకు వినతులు సమర్పిస్తామని, స్పందన లేకుంటే ఉద్యమిస్తామని చెప్పారు. త్వరలోనే వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలను పూర్తి చేస్తామని, తద్వారా పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. పార్టీ రాంబిల్లి మండల అధ్యక్షుడు పిన్నమరాజు కిశోర్, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, నెట్టం సత్యనారాయణ, గోకివాడ సూర్యనారాయణ, రామకృష్ణ, రేబాక రాము, వెంకీ, మోటూరు రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు, ఎస్.రాయవరం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం ఫీడర్‌లో ఎస్.రాయవరం, సర్వసిద్ధి, వాతాడ ఆక్వా చెరువులకు, వెంకటాపురం, ఉప్పరాపల్లి, లింగరాజుపాలెం, జేవీపాలెం, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, చినగుమ్ములూరు ఫీడర్‌లో పెట్టుగొల్లపల్లి, రామయ్య పట్నం, చెల్లాపురం, బోదిగళం, రామకృష్ణాపురం, పెద దొడ్డుగళ్లు, సీతమ్మపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కు వద్దంటూ గుర్రాజుపేటలో నిరసన



గుర్రాజుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఎస్.రాయవరం: నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల గ్రామ సరిహద్దులో ఏర్పాటు కాబోతున్న బల్క్ డ్రగ్ పార్కు వద్దంటూ గుర్రాజుపేట గ్రామస్తులు ఆందోళన చేశారు. నర్సీపట్నం ఆర్డీవో సమక్షంలో నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా గుర్రాజుపేట గ్రామస్తులు పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివెళ్లి నిరసన వ్యక్తం చేశారు. మా జీవితాలు, పిల్లలు భవిషత్ నాశనం చేసే కంపెనీలు మాకొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు శివరాజు, రామరాజు, చంటిరాజు పాల్గొన్నారు.